ఎ.వి. భరత్ కుమార్

# ఓ మై డాడ్

ఉదయం- కాన్వెంటు స్కూలుకి బయలుదేరుతున్నాడు ఏడేండ్ల శివ. కొడుకుని తయారుచేస్తోంది శారద. పేపర్ చూస్తున్నాడు రామారావు. షూ లేసెస్ కట్టుకుంటూ- ఓసారి మమ్మీవైపూ, మరోసారి డాడీవైపూ చూశాడు శివ. లంచ్ బేగ్ సర్దుతూ కొడుకు ఏదో చెప్పాలనుకుంటూ వున్నాడని గ్రహించింది శారద.

''ఏవిటీ... ఏవైనా కావాలా.'' అడిగింది.

''మమ్మీ! మరీ...'' ఆగాడు శివ.

''చెప్పూ...'

''ప్లీజ్ మమ్మీ!'' ఆ ఏడేండ్ల గొంతులో ఇరవై ఏళ్ల అభ్యర్థన వినిపించింది.

''ఏవిటి బాబూ. చెప్తేగదా...'' కొడుకుమీద తల్లి ప్రేమ బుజ్జగించింది.

కళ్లు పేపర్‌మీద వున్నా, ధ్యాస కొడుకు మీదే వుండటం వలన, బిడ్డ కోరిక ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తితో తలెత్తి చూశాడు రామారావు.

శివ తల్లిదండ్రుల మొహాలవంక- తన క్లాస్ టీచర్ మూడ్ కనిపెట్టటానికి, ఆమె కళ్లలోకి చూసినట్టు చూశాడు. తల్లీ, తండ్రీ మంచిమూడ్‌లో కనిపించారు. నమ్మకం కుదిరింది. తన కోరికకి 'యస్' అంటారు. ఇహ చెప్పెయ్యాలి... చెప్పేశాడు.

''మరీ... మా ఫ్రెండ్ 'అలెక్స్' లేడూ...'' మధ్యలోనే అడిగింది తల్లి.

''ఎప్పుడూ వాళ్లనాన్న గురించే చెబుతూంటాడని చెప్పావ్. ఆ పిల్లాడేనా.''

''అవును మమ్మీ! వాడిని మనింటికోసారి తీసుకొస్తాను మమ్మీ! వాడు మన యిల్లు చూడాలట.. నిన్నూ, డాడీని చూడాలట... ప్లీజ్ మమ్మీ.'' పిల్ల తీగ పందిరికి అల్లుకున్నట్టు- తల్లిని చుట్టేసుకుని అడిగాడు శివ.

శారద భర్తవైపు చూసింది. నవ్వుతూ తలూపేడు రామారావు.

''అలాగే- దానికేముంది. రేపు శనివారం- మీకు స్కూల్ 'హాఫ్‌డే' గదా. వాళ్లింట్లో చెప్పి రమ్మను. ఆదివారం కూడా మనింట్లోవుంటాడు.'' అంది శారద.

కొడుకు కళ్లలో మెరిసిన విజయకాంతిని చూసి గర్వపడ్డాడు తండ్రి. స్కూల్ బస్ హారన్ వినిపించింది.

''థాంక్యూ మమ్మీ! డాడీ బై...'' ఇద్దరికీ చెయ్యి వూపి, హుషారుగా వెలుపలికి పరిగెత్తాడు శివ.

• • •

మరుసటిరోజు- శనివారం.

స్కూల్ బస్ ఆగిన శబ్దం తర్వాత... తుఫాన్‌లా తన ఫ్రెండ్ అలెక్స్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు శివ.

''మమ్మీ'' దాదాపు కేక వేశాడు. శారద వచ్చింది. శివ ప్రక్కనే నిల్చునివున్న అలెక్స్‌ని చూసింది.

''వీడే... నా ఫ్రెండ్ అలెక్స్'' తల్లికి గర్వంగా పరిచయం చేశాడు శివ. అమెరికా అధ్యక్షుణ్ణి ఇంట్రడ్యూస్ చేసినంత గొప్పగా.

శారద కళ్లకి అలెక్స్ చాలా సాదాసీదాగా కనిపించాడు. ఫేరక్స్‌తో, అమూల్‌మిల్క్‌తో, ఆపిల్‌పండ్లతో- బొద్దుగా, ముద్దుగా తెల్లగా పెరిగిన తన కొడుకు ఫ్రెండ్ ఈ పిల్లాడా? వీడిలో ఏం ప్రత్యేకత వుందని, తన కొడుకు పదే పదే చెప్పేవాడు? అయినా తన కొడుకు స్నేహితుడు. తమ స్టేటస్‌కి తగినట్టు ఆదరించాలి అనుకుంది. కాని- ఆ తల్లి హృదయంలో ఏ మూలనా అభిమానం అనే 'భావన' కలగలేదు.

''రాబాబూ.. రా.'' అలెక్స్ వీపుమీద వున్న స్కూల్ బేగ్, చేతిలోని తెగిపోయిన ప్లాస్టిక్ లంచ్‌బేగ్ అందుకుంది.

శివ తన ఫ్రెండ్‌కి బాత్‌రూం చూపించాడు. స్నానం చేశాక, తన బట్టలు ఇచ్చాడు. ప్రేమకు ప్రేమ తప్ప- మరే అంతరాలు తెలియని అంతరాత్మలు వాళ్లవి.

''మా మమ్మీ డాడీ చాలా మంచివాళ్ళ్రా.. భయపడకు.'' అభయమిచ్చాడు తన మిత్రుడికి. ఆస్తులూ, అంతస్తులు లాంటి అడ్డుగోడలు తెలియని హృదయాలు వాళ్లవి. స్నేహానికి స్నేహం తప్ప మరో స్వార్థం ఆశించని కల్తీలేని పాల మనసులు వాళ్లవి.

శివ అలెక్స్‌ని ఖరీదైన తమ డైనింగ్ టేబిల్ దగ్గరకు తీసుకొచ్చి కూచోబెట్టాడు. అలెక్స్‌కి ఆ ఇల్లూ, వాతావరణం కొత్తగావుంది. వింతగా వుంది. అలవాటు పడటానికి అవస్థ పడుతున్నాడు. శారద 'మ్యాగీ నూడుల్స్' తెచ్చి పెట్టింది. శివ ఫోర్క్, స్పూన్‌తో తింటున్నాడు. అలెక్స్ ఫ్రెండ్‌ని చూస్తున్నాడు.

''తినరా'' అన్నాడు శివ.

''వద్దు...'' అన్నాడు అలెక్స్.

''ఏం... ఇష్టంలేదా'' అడిగింది శారద.

''కాదు ఆంటీ... అలవాటు లేదు. అన్నం తింటాను.'' అన్నాడు వినిపించీ, వినపించనట్టు.

''సాయంత్రం కూడా అన్నమే తింటవా?'' అదేదో వింత అయినట్టు అడిగింది శారద.

''అవును ఆంటీ... మా అమ్మ ఒక్కసారే అన్నం వండుతుంది. ఆకలేసినప్పుడు కొంచెం అన్నమే తింటాను.'' అన్నాడు సిగ్గుపడుతూ. ఆమాటల్లో మర్మంలేని నిజాయితీ వుంది.

''సరే... అన్నం పెడ్తాను వుండు.'' అంటూ వెళ్లి, అన్నం, కూరలూ తెచ్చింది.

''ఆంటీ... అవి వద్దు.'' కూరల్ని చూపిస్తూ అన్నాడు.

''పచ్చడి వుంటే పెట్టండి.'' అడిగాడు అలెక్స్.

''ఏవిటీ... ఈ మనుషులు. అన్నంలో కూరలు కూడా తినరా. గొప్పగా చెప్పుకునే ఆ తండ్రి యింత పిసినారా.'' అనుకుంది శారద మనసులో. పైకి మాత్రం ''ఓ- పచ్చళ్లకేం... అన్నిరకాలూ వున్నాయ్.'' అంటూ వెళ్లి నాలుగురకాల పికిల్స్ బాటిల్స్ తెచ్చి ముందు పెట్టింది. అలెక్స్ గోంగూర వడ్డించుకున్నాడు.

• • •

సాయంత్రం- శివ అలెక్స్‌కి తన క్రికెట్ బ్యాట్, బాల్ చూపించాడు. కాంపౌండు లోపలే ఇద్దరూ ఆట మొదలెట్టారు. రామారావు కారులో వచ్చి దిగాడు. అలెక్స్‌ని చూడగానే, తన కొడుకు చెప్పిన ఫ్రెండ్ అని గుర్తించాడు.

''హలో యంగ్ మేన్!'' అంటూ వచ్చి షేక్‌హేండ్ ఇచ్చాడు.

''మా డాడీరా'' పరిచయం చేశాడు శివ.

రామారావువంక పరీక్షగా ఓ క్షణం చూసేడు అలెక్స్. త్వరగా తేరుకుని ''హలో అంకుల్'' అన్నాడు.

''ఒన్ మినిట్. డ్రెస్ ఛేంజ్ చేసుకుని వస్తాను. క్రికెట్ ఆడదాం.'' అంటూ లోపలికి వెళ్లి, తొందరగానే వచ్చి పిల్లలతో కలిశాడు రామారావు.

''కమాన్ బోయిస్... నేను బ్యాటింగ్- శివ బౌలింగ్. నువ్వు ఫీల్డింగ్. ఓ.కే..'' అడిగాడు అలెక్స్‌ని.

''అంకుల్. నేను మీకు బౌలింగ్ చేస్తా. ప్లీజ్.''

''ఓ.కె. శివా. నువ్వు ఫీల్డింగ్ చెయ్యి'' అంటూ రామారావు బ్యాట్ పట్టుకుని, నేలలో గుచ్చిన మూడు కర్రల స్టంప్స్ ముందు పొజిషన్‌లో నిలుచున్నాడు. అలెక్స్ ఫాస్ట్ బౌలింగ్ చేశాడు. రామారావు షాట్ కొట్టాడు. బాల్ కాంపౌండ్ దాటి వీధిలో దూరంగా పడింది.

''షాట్..'' చప్పట్లు కొట్టి, గోడదూకి వెళ్లి బాల్ తీసుకొచ్చాడు శివ.

''చూశావా. మాడాడీ షాట్' గర్వంగా తలెగరేస్తూ

అన్నాడు శివ. అలెక్స్ మొహం చిన్నబోయింది. సహజంగా అలాంటి పరిస్థితిలో బౌలర్‌కుండే సైకాలజీ తెలుసు రామారావుకు. అందులోనూ అలెక్స్ చిన్నవాడు కాబట్టి.

''కమాన్ అలెక్స్... టేకిట్ ఈజీ.'' ఉత్సాహపరిచాడు. కాని అలెక్స్ ఉక్రోషంగా అన్నాడు-

''మా డాడీ యింకా బాగా ఆడతాడు. మాడాడీ షాట్ కొడితే, బాల్ అస్సలు కనిపించదు. తెల్సా.''

చీకటి పడేవరకూ, మార్చి మార్చి బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ ఆడారు. ''ఇదే లాస్ట్ బాల్'' అంటూ రామారావు అలెక్స్‌కి బౌల్ చేశాడు. క్లీన్ బౌల్డ్ అయ్యాడు అలెక్స్.

''క్లీన్ బౌల్డ్. మాడాడీ బౌలింగ్ చూశావా, శ్రీనాధ్‌లాగా సూపర్‌ఫాస్ట్'' తన తండ్రి గురించి గర్వంగా చెప్పుకున్నాడు శివ. అలెక్స్ స్వరం తీవ్రంగా వుంది. చూపులు తీక్షణంగా వున్నాయి.

''మాడాడీ బౌల్ చేస్తే, స్టంప్స్ విరిగిపోతాయ్. ఇంకా సూపర్ ఫాస్ట్.'' అన్నాడు.

''ఏంట్రా మాడాడీ మాడాడీ అంటావ్. ఓసారి మీడాడీని తీసుకురా. మాడాడీకి మీడాడీకి పోటీ పెడదాం. ఎవరు గెలుస్తారో చూద్దాం.'' అన్నాడు శివ పౌరుషంగా.

అలెక్స్ మనసు గాయపడినట్టు గ్రహించాడు రామారావు. ''షటప్ శివా! నీ డాడీ నీకు గొప్ప. తన డాడీ తనకు గొప్ప.'' కొడుకును మందలిస్తూ, అలెక్స్‌ని బుజ్జగించాడు.

''కమాన్ అలెక్స్... నీ ఫ్రెండ్ కదా... సీరియస్‌గా తీసుకోకు. స్పోర్టివ్‌గా తీసుకోవాలి.''

ఆట ఆపి పిల్లల్ని తీసుకుని ఇంట్లోకి వెళ్లాడు రామారావు.

• • •

రాత్రి భోజనాలు అయ్యాక- ''కేరమ్స్ ఆడదామా? ఛెస్ ఆడదామా?'' అలెక్స్‌ని అడిగాడు రామారావు.

''మీ ఇష్టం.'' అన్నాడు అలెక్స్.

''ఓకె. నలుగురం వున్నాంగదా. కేరమ్స్ ఆడదాం.'' అన్నాడు రామారావు.

రామారావు జట్టుగా శివ, శారద జట్టుగా అలెక్స్.

ఆట మొదలెట్టారు. రామారావు స్ట్రయికర్ తీసుకుని వరుసగా నాలుగు వైట్ కాయిన్స్‌ని పాకెట్స్‌లో వేశాడు. శివ తన తండ్రి ప్రతాపానికి పొంగిపోయాడు.

''మా డాడీతోటి ఎవరూ ఆడలేరు.'' అన్నాడు తన సహజ ధోరణిలో-

వెంటనే సమాధానమిచ్చాడు అలెక్స్ యింకా సహజంగా. ''మాడాడీ అయితే ఈపాటికి కాయిన్స్ అన్నీ క్లియర్ చేస్తారు.''

ఇప్పుడు రామారావు పెద్దరికం అలెక్స్ వయసుకంటే చిన్నదైపోయింది. మనసులో ఎక్కడో, ఏ మూలనో 'ఇగో' కలుక్కుమంది.

'ఏవిటి వీడు? మాటి మాటికీ 'మాడాడీ, మాడాడీ' అంటాడు. బోడి డాడీ అంతగొప్పవాడా? ఓసారి రమ్మనాలి. తనో నేనో తేలిపోతుంది.' కనిపించని అసూయ, ద్వేషం చూడని ఆ మనిషిమీద పళ్లు కొరికాయి.

పడుకునే ముందు శివనీ, అలెక్స్‌నీ బెడ్‌రూంలో చేర్చి 'గుడ్‌నైట్' చెప్పి తలుపు మూసి, వెనుదిరిగాడు రామారావు.

''మాడాడీ, రోజూ పడుకునేముందు నాకు బ్యూటిఫుల్ స్టోరీస్ చెప్తార్రా.'' అంటున్నాడు శివ.

గర్వంగా ఫీలయ్యాడు రామారావు.

''మాడాడీ చెప్పినట్టు అస్సలెవరూ స్టోరీస్ చెప్పలేరు. తెలుసా?'' అలెక్స్ కంఠం వినిపించింది.

''రాస్కెల్'' అనుకోకుండానే, ఆమాటలు, గుండెలోపలి నుండి, గొంతుదాటి పెదవుల మీదికి పాకేయి. వేగంగా అడుగులు వేస్తూ, తన బెడ్‌రూం వైపుకు వెళ్లాడు.

• • •

ఆదివారం- మధ్యాహ్నం వరకూ గడచిపోయింది. 2 గంటలప్పుడు కాలింగ్ బెల్ మోగింది. టి.వి. చూస్తున్నారు అందరూ. రామారావు వెళ్లి తలుపుతీశాడు.

ముప్పై ఏళ్లలోపలవున్న స్త్రీ నిల్చుని వుంది. ''నేను... అలెక్స్ మదర్ని.'' తనని పరిచయం చేసుకుంది.

''ఓ.. ప్లీజ్ కమిన్'' లోపలికి ఆహ్వానించాడు రామారావు. మేరి లోపలికి వచ్చింది వినయంగా. శారదకి పరిచయం చేశాడు.

''మావాడు ఏదైనా ఇబ్బంది కలిగించి వుంటే క్షమించండి.'' నమ్రత తొంగి చూసింది ఆమె కంఠంలో.

''అబ్బే. అదేం లేదండీ. హి ఈజ్ ఏ నైస్ బోయ్.'' అన్నాడు రామారావు మర్యాదని కుమ్మరిస్తూ.

ఈలోపల అలెక్స్ లోపలికి వెళ్లి తన బట్టలు వేసుకుని వచ్చాడు. మేరి కృతజ్ఞతలు చెప్పుకుని, అలెక్స్‌ని తీసుకుని బయలుదేరింది.

''వీలున్నప్పుడు మీవారిని ఓసారి రమ్మని చెప్పండి. మీవాడి మాటలు విన్న తర్వాత, వాడి డాడీని చూడాలనివుంది.'' అన్నాడు రామారావు.

మేరి ఒక్షణం శిల్పంగా మారి, మళ్లీ మామూలు మనిషయింది. కళ్లలోకి పొంగిన నీళ్లు తుడుచుకుంటూ చెప్పింది-

''నా హజ్బెండ్- వీడు కడుపులో వున్నప్పుడే చనిపోయారు. నా తృప్తికోసం తన డాడీ గురించి గొప్పగా చెప్పేదాన్ని. లేని తండ్రి గురించి గొప్పగా... చెప్పుకోవడం...'' తర్వాత మాటలు రాలేదు. కన్నీళ్లు ఒత్తుకుంటూ, మౌనంగా నమస్కరించి, అలెక్స్ భుజం మీద




చెయ్యివేసి, నడిపించుకుంటూ వెళ్లిపోయింది ఆ తల్లి.

రామారావులోని ఈర్ష్య, శారదలోని స్టేటస్- ఇప్పుడు నిజాయితీగా కన్నీళ్లు కార్చేయి.

★